# హాలా! యేమి నీ లీల?

రచన:
"పద్మప్రియా"

'మాలా! దిక్కులు దద్దరిల్లేటట్టు పక్క రూం లోంచి పిడుగు లాంటి పిలుపు కాదు అరుపు వినపడింది. నవలేదో చేతికి తీసుకుని కునికిపాట్లు పడుతున్న నేను 'స్టన్న'యాను.

'మాలా! నన్ను విడిచి వెళ్ళిపోయావా? యెంత కర్కశమైంది నీ హృదయం. నిన్నే ప్రాణాధికంగా ప్రేమించే నన్ను వదలి వెళ్ళడానికి నీకు మనసెలా వొప్పింది? నీది నిజంగా గుండేనా? కాదు కాదు! నీకు మనసులేదు. దాని స్థానంలో పర్వతంకంటె, యినుము కంటె కఠినమైన పాషాణం వుంది. అందుకే వెళ్లి పోయావు నిర్దాక్షిణ్యంగా నా గుండెమీద యినుప పాదాలు వేసి నొక్కుతూ! నీవి యినప పాదాలా! కాదు యెంత మెత్తగా వుంటాయికాని ఆ సుకుమారంలో యెంత నిర్దాక్షిణ్యం వుంది. మాలా! యేనాడేనా నిన్ను కష్టపెట్టే పనిచేశానా? ఉహుం! చస్తే చేసే వాణ్ణికాదు. అయినా నీకేదో భయం. యెంత పిచ్చిదానివి మాలా! నీ శరీరమెంత సున్నితమో నీ మనస్సుకూడా అంతే సున్నిత మనుకున్నాను. నా అంచనా తప్పయింది. యీ పరిస్థితికి నేనెలా తట్టుకోను. నా కంటి పాపలా నిన్ను కాపాడుకున్నానే! ఆ విశ్వాసం అణుమాత్రం వున్నా నువ్వీనాడు నన్ను వదలి వెళ్ళగలవా? యీ కొత్త వూళ్ళో, కొత్త మనుషుల్లో యెలా బ్రతుకుతావు మాలా! యెలా బ్రతుకుతావు??

గుంటూరునుంచి వచ్చేటప్పుడు యేమని చెప్పాను? మాలా! మనం వెళ్ళేది మద్రాసుకి అక్కడ బ్రతుకు తెరువు తెలిసిన వాళ్లు తప్ప నీలాంటి మంచి వాళ్లు బ్రతక లేరని చెప్పానా? యిక్కడ జాగ్రత్తగా వుండాలి అని చెప్పలేదూ? అప్పుడు బుద్ధిమంతురాల్లా బుద్ధివూపావు. తీరా యిప్పుడు నువ్వు చేసేపని యిదా! అన్యాయాలు అక్రమాలు యిక్కడ యెక్కువ, గడిదాటి బయట రావద్దంటే 'అలాగే'నని కళ్ళతోటే చెప్పావే! అబ్బ! మాలా! అవి కళ్ళా నక్షత్రాలా! నల్లగా నిగనిగ మెరిసి పోతూవుండే నీ కళ్ళు నాకెంత యిష్టమో యెలా చెప్పను? ఆ కళ్ళకోసం యిప్పుడు యెవరి ముఖం వెతకను? నామాల యెక్కడుందని యెవర్ని అడగను.

మాలా మెత్తగా, నాజూగ్గా సుకుమారంగా వుండే నీ శరీరం యేదుర్మార్గుడి చేతిలో పడిందో కదా!

నేను వూరూరా తిరిగి నగలు అమ్మేవాణ్ణి. బాపట్లకు రాకపోతే అసలు నువ్వు నాకంటికి కనిపించేదానివే కావేమో! ఆ రోజు మీ యింట్లో శూర్పణఖ లాంటావిడ ఒకనగ కొనడానికి నన్ను పిలిచింది. నువ్వు గడపలో నుంచుని దీనంగా చూస్తున్నావు. అందమైన నీకన్నుల్లో ఆ దైన్యంమెందుకో అర్థంకాలేదు. 'లవ్ అట్' ఫస్ట్ సైట్'' అన్నటు నిన్ను మొదటిసారి చూడగానే నీమీద ప్రేమ కలిగింది. దాన్ని యెలా వెల్లడి చెయ్యాలో నిన్నెలా నాదాన్ని చేసుకోవాలో అర్థంకాలేదు. ఆ శూర్పణఖ నగ తీసుకుని డబ్బులిచ్చేవరకు పరధ్యానం_సారీ_నీధ్యానంలోనే వున్నాను. 'అప్పుడే వెళ్ళవలసి వచ్చిందే' అని బాధపడుతూ డబ్బులు తీసుకుని వెళ్ళి పోయాను. నువ్వు గేటుదాకావచ్చి నన్నే చూస్తున్నావు. నీకు నేనంటే యిష్టమే నన్నమాట! యింతలో ఆ శూర్పణఖ వెనకనించి వచ్చి కఱ్ఱతో నీ వీపుమీద కొట్టింది. బహుశా నన్ను చూస్తున్నావనే అలా కొట్టి వుంటుంది. నామూలంగా నువ్వు దెబ్బలు తినడం సహించ లేక వడివడిగా వెళ్లిపోయాను. అప్పటి నీరూపం మరిచి పోగలనా మాలా! నీ కన్నులనిండా నీరు దైన్యంతో కలిసి ప్రవహిస్తోంది.

యింక యెప్పుడు నగలు తెచ్చినా ప్రత్యేకంగా నీ కోసం మీ యింటిదగ్గర కొచ్చి కూర్చునేవాడిని ఆ శూర్పణఖని మంచిచేసుకుంటూ. నువ్వు పిల్లిలా దొంగ చూపులుచూస్తూ తప్పుకు తిరిగేదానివి. యిలా చూపులతో యెంతో కాలం గడపలేక పోయాను. వుండబట్ట లేక యేకాంతంగా వున్న నిన్ను పట్టుకుని అడిగాను 'నాతో వస్తావా' అని. సంతోషంతో వెంటనే వొప్పుకిని, సిగ్గుపడుతూ పరిగెత్తావు లోపలికి. తరవాత ఆ శూర్పణఖ నడిగాను నిన్ను గురించి. ఆవిడ నీమీద కారాలు మిరియాలునూరుతూ "ఆ శనిపీనుగ సంగతే అడుగుతున్నావా! దాని తల్లి మా యింట్లోనే కని చచ్చింది. యిది భూమి మీద పడిందో లేదో నా మాంగల్యం గుటుక్కుమంది. తిండి దండగ ముండ,

చస్తే పీడా పోతుంది'' అంది నమిలిమింగేసేట్టు నిన్ను చూస్తూ.

'పోనీ నాకిస్తారా' అన్నాను. డబ్బులకి యిస్తానంది.

'చూసావా! నువ్వు తన యింట్లో వుండి అన్నానికి కరువువంటు చచ్చినా ఫరవాలేదు. నేను తీసుకు వెళతానంటే డబ్బులు కావాలిట డబ్బులు! ఆవిడ అడిగిన డబ్బు ఆవిడ ముహాన్నపోసి నిన్ను తెచ్చుకున్నాను. ఆ నరకం నుంచి నిన్ను రక్షించానని కృతజ్ఞతగా చూసావు నాకేసి. నా కాళ్ళ మీద తల ఆనించి మ్రొక్కావు. ఆనందాతిరేకంతో నా కౌగిలిలో ఒదిగి పోయావ్. గుంటూరు తీసుకువచ్చి మా అమ్మకి నిన్ను అప్ప చెప్పాను. అమ్మ చాలా మురిసిపోయింది నిన్ను చూసి. కన్న కూతురుకంటె మిన్నగా నిన్ను చూసుకునేది. ఆ కృతజ్ఞతేనా లేదా నీకు? యింత ఘాతుకం యెలా చెయ్యగలిగావు. నువ్వు మా అమ్మదగ్గరనుంటేనే బాగుండేది. మద్రాస్ తీసుకురావడం ముప్పైపోయింది. యిక్కడ 'షో' యెక్కువ యెవరిమోజులో పడ్డావు మాలా! యే దుర్మార్గుడు నిన్ను నానుంచి దూరం చేశాడు? వాణ్ణి చీల్చి చెండాడి కాకులకు వేసినా, నా కసి తీరుతుందా! మాలా నువ్వులేంది యెలా బ్రతకను. ఆలోటు నాకెవరు తీరుస్తారు మాలా? యింటికి రాగానే ఆప్యాయంగా యెదురు వచ్చే దానివి. నన్ను చూడగానే నీ కనులు వింతకాంతుల్ని నింపుకునేవి. ఆ ఆపేక్ష యెక్కడికి పోయింది? యెలా వెళ్ళగలిగావు మాలా! ఒంటరిగా వున్న నిన్ను యీ పాడు ప్రపంచం బ్రతకనిస్తుందా? ఎంత అమాయకురాలివి ఏం చూచుకుని, యే ధైర్యంతో బయటికి అడుగుపెట్టావు. మాలా! మాలా! మరలిరావా!'' తరవాత యింకేం వినిపించలేదు. చిన్నగా యేడుస్తున్న సవ్వడి. యీ లాండ్జింగ్‌లో యివాళే రూం తీసుకుని జేరాను నేను. శలవులు జాలీగా మద్రాస్‌లో గడపచ్చని. నేను వచ్చినప్పటినుంచీ ఆ రూంలో మనుషుల్ని చూడలేదు నేను. తాళం వేసే వుంది. ఆ రూంలో వుండే ఆయనతో కనీసం ముఖ పరిచయంకూడా లేదు నాకు. పూర్ ఫెలో! ఆ మాల యెవరోగాని, నిజంగా ఆడదేనా! యెంత ధైర్యం ఆవిడకి కట్టుకున్న మొగుణ్ణి, యింత ప్రేమించిన వాడిని వదిలి వెళ్ళాలిసిన అగత్యం యేమికచ్చింది. యెవరో కవి చెప్పినట్లు 'నిజంగా స్త్రీ' చపలత్వమే నేను చస్తే యిలాంటి దాన్ని చేసుకోను. చేసుకున్నా గుమ్మం దాటి బయటికి రానివ్వను. నా అనుమతిలేకుండా బయటికి వెళ్ళిందా! దానికోసం ఒక్క నీటి చుక్కకూడా రాల్చనుగాక రాల్చను అనుకున్నాను. తన భార్యారత్నం చేసిన ఘన కార్యానికి బాధపడుతూ మహానుభావుడే అఘాయిత్యమైనా చెయ్యడుకదా! మందలించాలనుకుంటూ లేచాను. నవలపెట్టలోపడేసి చెరిగిన క్రాఫ్ సరిచేసుకుంటూ బయటికి వచ్చాను.

''మిస్టర్! ఒకసారి తలుపు తీస్తారా!'' చిన్నగా పిలిచాను. మూడు నిముషాల తరువాత తలుపు తీశాడు. యెక్కువ యేళ్లుండవు అతనికి. పాతిక లోపే వుంటుంది పాపం! మనిషి అందంగానే వున్నాడు.

'రండిసార్! లోపలికి' అన్నాడు ప్రక్కకి తొలగుతూ. లోపలికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను.

'మీరిందాకటి నుంచి యేదో బాధపడుతున్నట్టున్నారు'' అన్నాను. అతని నోటివెంట చెప్పించాలని.

అవునండి! నా ప్రాణాధికంగా ప్రేమించిన మాల నన్ను విడిచి వెళ్లిపోయింది. బాధగా తలపట్టుకుంటూ అన్నాడు.

''అయామ్ వెరీసారీ! మీకు పెళ్ళయి యెన్నిరోజులయిందండీ!''

''నాకింకా పెళ్ళి కాలేదండీ'' అన్నాడు.

నాకు లాటరీలో పది లక్షలు వచ్చాయని చెప్పినా, ప్రపంచం తలక్రిందులైందన్నా నేనింత ఆశ్చర్యపోనేమో! అమితాశ్చర్యం నాకనుల లోంచి తొంగి చూసింది.

''మరి మాల మీ భార్యకాదా!'' నీరసంగా అడిగాను.

అంత బాధలోను న[illegible] పగలబడి పొట్ట చేత్తో పట్టుకుని అయిదు నిముష[illegible]సేపు నవ్వుతూనే వున్నాడు. నాకు కోపంవచ్చింది తని అసభ్య ప్రవర్తనకి. నా అంతటి పెద్ద మనిషిని పక్కనపెట్టుకుని యిలా నవ్వుతాడా! యిడియట్. విసురుగా కుర్చీలోంచి లేచాను.

''సార్! వెళ్లిపోకండి. మాల - మాలంటే నేను పెంచుకునే కుక్కపిల్లండి, నా భార్యకాదు,'' నవ్వాపుకుంటూ అన్నాడు.

''ఆ!'' విస్మయపోయి తిరిగి కుర్చీలో కూలబడ్డాను.